పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రం ప్రారంభం

కోటగిరి, మార్చి 14 : పొతంగల్ సహకార సంఘం పరిధిలోని హెగ్డోలి గ్రామంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పొద్దు తిరుగుడు పంట కొనుగోలు కేంద్రాన్ని విండో చైర్మన్ శాంతేశ్వర్‌పటేల్ గురువారం ప్రారంభించారు. క్వింటాల్‌కు రూ.6,760 చెల్లిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు పుప్పాల శంకర్, మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, సీఈవో భరత్, విండో డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక వేసవి శిబిరం

డిచ్‌పల్లి, మార్చి 14 : టీయూ ఎన్ఎస్ఎస్ యూనిట్ -1, 4 ఆధ్వర్యంలో సాంపల్లి, సాంపల్లి తండాలో వేసవి ప్రత్యేక శిబిరాలను గురువారం ఏర్పాటుచేశారు. రిజిస్ట్రార్ యాదగిరి ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాలను ప్రారంభించి మాట్లాడారు. పర్యావరణ సంరక్షణ కోసం విద్యార్థులు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ రవీందర్‌రెడ్డి, ప్రజా సంబంధాల డైరెక్టర్ పున్నయ్య, శ్రీనివాస్, బి.ప్రవంతి, స్వప్న, సురేశ్, పంచాయతీ కార్యదర్శి రాధిక, విద్యార్థులు పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారుడికి అభినందన

రాజేశ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్

కంఠేశ్వర్, మార్చి 14 : తైక్వాండో క్రీడాకారుడు రాజేశ్‌ను ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ తన నివాసంలో గురువారం అభినందించారు. ఆర్మూర్‌లోని సెయింట్‌పాల్ స్కూల్‌లో ఆరోతరగతి చదువుతున్న రాజేశ్.. బెంగళూరులో ఇటీవల నిర్వహించిన అండర్-14 జాతీయస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో బంగారు పథకం సాధించాడు. ఢిల్లీలో మే నెలలో నిర్వహించే అంతర్జాతీయ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొననున్నాడు. క్రీడాకారుడికి కావాల్సిన తైక్వాండో కిట్, స్పాన్సర్‌షిప్ చేయడానికి సహకరిస్తానని హామీ ఇస్తూ అభినందించారు.

మంటలు అంటుకుని లారీ దగ్ధం

దగ్ధమవుతున్న లారీ

డిచ్‌పల్లి, మార్చి 14 : వాహనాల లోడ్‌తో వెళ్తున్న లారీ మంటలు చెలరేగి దగ్ధమైంది. తమిళనాడు నుంచి రాయ్‌పూర్ వైపు వెళ్తున్న లారీ 44వ నంబర్ జాతీయ రహదారిపై మెంట్రాజ్‌పల్లి వద్ద గురువారం లారీలో మంటలు చెలరేగాయి. దీంతో డ్రైవర్ కిందికి దూకి ప్రమాదం నుంచి తప్పించుకున్నాడని స్థానికులు తెలిపారు. లారీ కాలిపోయింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిన్‌ను క్లియర్ చేశారు.

రూరల్ మండలంలోని అశోక్‌ఫారంలో ఉన్న శ్రీ వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం ప్రత్యేకపూజలు, స్వామివారి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కల్యాణాన్ని వీక్షించారు.
– సారంగాపూర్, మార్చి 14

డిచ్‌పల్లిలో పటాకులు కాలుస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఇందల్వాయిలో మిఠాయిలు తినిపించుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

ధర్పల్లిలో హర్షం వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిరికొండలో...

డిచ్‌పల్లి/ ధర్పల్లి/ ఇందల్వాయి/ సిరికొండ, మార్చి 14 : నిజామాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా బాజిరెడ్డి గోవర్ధన్‌ను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించడంపై బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిచ్‌పల్లి మండల కేంద్రంలో, ధర్పల్లిలోని గాంధీచౌక్ వద్ద, ఇందల్వాయిలోని బస్టాండ్ వద్ద గురువారం పటాకులు కాల్చి, మిఠాయిలు తినిపించుకున్నారు. బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. బాజిరెడ్డి గోవర్ధన్ బీసీ సామాజికవర్గానికి చెందిన బలమైన, ప్రజాదరణ పొందిన నేత అని, కేసీఆర్ బాజిరెడ్డి గోవర్ధన్‌కు ఎంపీ టికెట్ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. బాజిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని, బీసీ కులాలు మద్దతు తెలుపాలని కోరారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

కార్యక్రమంలో మాట్లాడుతున్న మేయర్ దండు నీతూకిరణ్

ఖలీల్‌వాడి, మార్చి 14 : జిల్లాకేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మేయర్ దండు నీతూకిరణ్, జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, ట్రైనీ కలెక్టర్ కిరణ్మయి, మహిళా సంక్షేమాధికారిణి రసూల్‌బీ, డీఎంహెచ్‌వో సుదర్శనం జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో దూసుకెళ్తున్నారని, మహిళలు చర్చల్లో పాల్గొని వారి అభిప్రాయాలు తెలియజేయాలని అన్నారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆటపాటల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

ఉగాది కవితలకు ఆహ్వానం

సుభాష్‌నగర్, మార్చి 14 : ఉగాది పండుగను పురస్కరించుకొని సంస్కార భారతి -ఇందూరు శాఖ ఆధ్వర్యంలో ఉగాది కవితా సంకలనాన్ని రూపొందిస్తున్నట్లు సంస్కార భారతి అధ్యక్షుడు గంట్యాల ప్రసాద్, కార్యదర్శి చామకూర శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. అయోధ్య వైభవం పేరుతో కవితా సంపుటిని ముద్రిస్తున్నట్లు చెప్పారు. కవులు తమ కవితలను అంశానికి తగిన విధంగా 18 పంక్తులకు మించకుండా ఈనెల 25వ తేదీలోగా 9440356306 నంబర్‌కు పంపాలని సూచించారు. ఏప్రిల్ 9న సంపుటిని ఆవిష్కరిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో కందకుర్తి ఆనంద్, సాయిబాబు పాల్గొన్నారు.

గుంజిళ్ల తో జ్ఞాపకశక్తి

డిచ్‌పల్లి, మార్చి 14 : మండల కేంద్రంలోని విద్యా హైస్కూల్‌లో 'సూపర్ బ్రెయిన్ యోగా'పై గుంజిళ్ల మాస్టర్‌గా పేరొందిన అందె జీవన్‌రావు గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. గుంజిళ్లు తీయించే పద్ధతి మన దేశంలో శిక్షగా భావించడంతో కనుమరుగవుతున్న తరుణంలో పాశ్చాత్య దేశాల్లో గుంజిళ్లు సూపర్ బ్రెయిన్ యోగా అనే ఆధునిక పేరుతో ప్రాచుర్యంలోకి వచ్చిందని తెలిపారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈ అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో సూపర్ బ్రెయిన్ యోగా చేయించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సందీప్, డాక్టర్ అనితాశ్రీశైలం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ. 20 లక్షల విలువ చేసే అల్ప్రాజోలం పట్టివేత

వినాయక్‌నగర్, మార్చి 14 : కల్తీ కల్లు తయారీకి వినియోగించే అల్ప్రాజోలాన్ని కారులో తరలిస్తుండగా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ దాడి చేసి పట్టుకున్నది. నిజామాబాద్ డివిజన్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి ఆదేశాల మేరకు కామారెడ్డి పట్టణంలోని ఇంటర్నేషనల్ హోటల్ వద్ద అధికారులు కారును తనిఖీ చేశారు. రాజస్థాన్ రాష్ట్రంలోని నాగౌర్ జిల్లా లాడ్ను గ్రామానికి చెందిన భవానీసింగ్ వద్ద రూ. 20 లక్షల విలువ చేసే రెండు కిలోల అల్ప్రాజోలం లభించినట్లు అధికారులు తెలిపారు. రాజస్థాన్‌లో ముఖేశ్‌సింగ్ వద్ద కొనుగోలు చేసి, హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన సుదర్శన్‌కు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. తనిఖీ సమయంలో సుదర్శన్ అనే వ్యక్తి కారును వదిలేసి అక్కడి నుంచి పరారైనట్లు ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు. కేసు నమోదు చేసుకొని కామారెడ్డి ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. దాడిలో నిజామాబాద్ ప్రొహిబిషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ చంద్రభాను నాయక్, ఇన్‌స్పెక్టర్లు స్వప్న, వెంకటేశ్, ఎస్సైలు విక్రం కుమార్, నర్సింహాచారితోపాటు సిబ్బంది రాజన్న, హమీద్, ఉత్తమ్, శివ, విష్ణు, అవినాష్, గంగారాం, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నగరంలో 'చిరుత సంచారం' వైరల్

- **పాదముద్రలను పరిశీలించిన ఫారెస్ట్ అధికారులు**

పాదముద్రలను పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు

వినాయక్‌నగర్, మార్చి 14 : జిల్లాకేంద్రంలోని కంఠేశ్వర్‌లో ఉన్న ఎంఎస్ఆర్ కళాశాల పరిధిలో చిరుత సంచరిస్తున్నదని స్థానికులు గురువారం ప్రచారం చేశారు. రైల్వేట్రాక్ ప్రాంతంలో చిరుతను గమనించామని స్థానికులు చర్చించుకోవడం, సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ విషయం ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించడంతో నార్త్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పద్మారావు, టాస్క్‌ఫోర్స్ రేంజ్ ఆఫీసర్ రామేశ్వర్ బృందంతో కలిసి ఘటనా స్థలం వద్ద మట్టిలో పాదముద్రలు పరిశీలించారు. అవి చిరుత పాదముద్రలు కావని స్పష్టం చేశారు. అయినప్పటికీ రాత్రి సమయంలో ఒంటరిగా బయట తిరుగవద్దని సూచించారు.

ఇంటర్ పరీక్షలకు 468 మంది గైర్హాజరు

ఖలీల్‌వాడి, మార్చి 14 : జిల్లావ్యాప్తంగా గురువారం నిర్వహించిన గణకశాస్త్రం, రసాయన శాస్త్రం పరీక్షలతో ప్రధానమైన ఇంటర్ పరీక్షలు పూర్తయ్యాయని జిల్లా ఇంటర్ విద్యాధికారి రఘురాజ్ తెలిపారు. పరీక్షలకు 468 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వెల్లడించారు. మరో రెండు రోజులు బ్రిడ్జి కోర్సు సబ్జెక్టుల పరీక్షలు కొనసాగుతాయని పేర్కొన్నారు. మొత్తం 36 మంది విద్యార్థులపై మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదైనట్లు వెల్లడించారు.

మూల్యాంకన విధుల్లో తప్పకుండా పాల్గొనాలి

ఖలీల్‌వాడి, మార్చి 14 : జిల్లాకేంద్రంలోని ఇంటర్ మూల్యాంకన కేంద్రంలో జవాబుపత్రాల మూల్యాంకనం ప్రారంభమైందని క్యాంపు అధికారి రవికుమార్ తెలిపారు. సంస్కృతం పేపర్ల మూల్యాంకనం ఇప్పటికే ప్రారంభమైందని, ఈనెల 16 నుంచి ఇతర సబ్జెక్టులు ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. అన్ని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు మూల్యాంకన విధులు కేటాయించిన అధ్యాపకులను విధుల నుంచి రిలీవ్ చేయాలని ఆదేశించారు. రిలీవ్ చేయని ప్రిన్సిపాళ్లపై, రిలీవ్ చేసినా విధుల్లో పాల్గొనని అధ్యాపకులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి

డిచ్‌పల్లి, మార్చి 14 : మండలంలోని ధర్మారం(బీ)లో కరెంట్ స్తంభంపైకి ఎక్కి మరమ్మతులు చేస్తుండగా విద్యుత్‌షాక్‌తో అదే గ్రామానికి చెందిన అంజద్ (32) మృతిచెందినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. మృతుడి సోదరి సోగరేరా బేగం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గ్రీన్‌చాలెంజ్‌ను స్వీకరించిన ఎమ్మెల్యే వేముల

వేల్పూర్‌లో మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, మార్చి 14: ఎంపీ సంతోష్‌కుమార్ చేపట్టిన గ్రీన్‌చాలెంజ్‌ను బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి స్వీకరించారు. తన పుట్టినరోజు సందర్భంగా మండలకేంద్రంలోని తన స్వగృహం వద్ద గురువారం మొక్కను నాటారు. శుభకార్యాల సందర్భంగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.

కులం పేరుతో దూషించిన 8 మందికి జైలు శిక్ష

వినాయక్‌నగర్, మార్చి 14 : షెడ్యూల్డ్ కులానికి చెందిన ఓ వ్యక్తిని కులం పేరుతో దూషించి, దాడికి పాల్పడిన 8 మందికి ఏడాది చొప్పున జైలు శిక్ష విధిస్తూ నిజామాబాద్ షెడ్యూల్డ్ కులాలు, తెగల అత్యాచారాల నిరోధక విచారణ న్యాయస్థానం స్పెషల్ జడ్జి శ్రీనివాస్ గురువారం తీర్పు వెల్లడించారు.అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బంటు వసంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మాక్లూర్ మండలంలోని మదన్‌పల్లికి చెందిన బోపతి ప్రభాకర్‌ను 10 మార్చి, 2020లో 8 మంది కర్రలు, చెప్పులతో కొట్టి, కులం పేరుతో దూషించారు. బాధితుడి ఫిర్యాదుతో కోర్టులో నేరం రుజువు కావడంతో ఒక్కొకరికి ఏడాది చొప్పున జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

మోపాల్‌లో డీపీవో పర్యటన

మోపాల్ (ఖలీల్‌వాడి), మార్చి 14 : మోపాల్ మండలంలోని వడ్డెర కాలనీలో ఉన్న జీపీ కార్యాలయాన్ని డీపీవో తరుణ్‌కుమార్ గురువారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. జీపీ పనులు చిత్తశుద్ధితో చేస్తున్నందుకు ఎంపీడబ్ల్యూ వర్కర్ నర్సయ్యను ఘనంగా సన్మానించారు. మోపాల్‌లో పోలింగ్ కేంద్రాన్ని, ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సందర్శించారు. ఆయన వెంట ఎంపీడీవో లింగంనాయక్, ఎంపీవో మహ్మద్ ఇక్బాల్ ఉన్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి

రుద్రూర్, మార్చి 14 : రుద్రూర్ శివారులోని గూండ్ల వాగు సమీపంలో కోడి పందేల స్థావరంపై సీఐ జయేశ్‌రెడ్డి సిబ్బందితో కలిసి గురువారం దాడి చేశారు. కోడి పందేలు నిర్వహిస్తున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని, రూ. 4,700 నగదు, 9 కోళ్లను స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కుక్క దాడిలో ఒకరికి తీవ్ర గాయాలు

- **ప్రభుత్వ దవాఖానలో అందుబాటులో లేని మందులు**
- **108 అంబులెన్సులో జిల్లా దవాఖానకు తరలింపు**

బాల్కొండ, మార్చి 14: మండల కేంద్రంలో బుధవారం రాత్రి గంజిగిరి మహేందర్‌పై పిచ్చికుక్క దాడి చేయడంతో చేతికి, రెండు చోట్ల కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను ముందుగా బాల్కొండ ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ మందులు అందుబాటులో లేకపోవడంతో 108 అంబులెన్సులో జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. దవాఖానలో మందులు అందుబాటులో ఉంచాలని స్థానికులు కోరుతున్నారు. మండల కేంద్రంలో కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు.

సంక్షిప్తంగా..

- **పరీక్ష అట్టలు, పెన్నుల పంపిణీ** – డిచ్‌పల్లి, మార్చి 14 : మండలంలోని మెంట్రాజ్‌పల్లి జడ్పీహెచ్ఎస్‌లో పదోతరగతి విద్యార్థులకు ఏఆర్‌బీ కిడ్స్ వరల్డ్ ఫౌండర్ అల్లుల్ల అనిల్ పరీక్ష అట్టలు, పెన్నులు, వాటర్‌బాటిళ్లను గురువారం పంపిణీ చేశారు. పదోతరగతి వార్షిక పరీక్షలు రాసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.
- **సీసీ రోడ్డు పనులు ప్రారంభం** - ధర్పల్లి, మార్చి 14 : మండల కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్ గురువారం ప్రారంభించారు.
- **ఇంటి పన్ను వసూలు కోసం స్పెషల్‌డ్రైవ్** - సారంగాపూర్, మార్చి 14 : మండలంలోని 19 జీపీల్లో వంద శాతం ఇంటి పన్ను వసూలు కోసం కార్యదర్శులతో కూడిన రెండు బృందాలు స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నాయి. పాల్దా గ్రామంలో ఎంపీవో మధురిమ పర్యవేక్షణలో కార్యదర్శుల బృందం గురువారం ఇంటి పన్ను వసూలు చేసింది. ఒకరోజులో రూ.70వేల పన్ను వసూలైనట్లు ఎంపీవో తెలిపారు.
- **శివాజీ విగ్రహం ఏర్పాటు**- రుద్రూర్, మార్చి14 : రుద్రూర్ బస్టాండ్ సమీపంలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని గురువారం ఏర్పాటు చేశారు.
- **బోరుబావి ఏర్పాటుకు భూమిపూజ** - మోస్రా (చందూర్), మార్చి 14 : చందూర్ మండల కేంద్రంలోని 7వ వార్డులో బోరుబావి ఏర్పాటు కోసం ఏఎంసీ మాజీ చైర్మన్ అర్కల సాయారెడ్డి గురువారం భూమిపూజ చేశారు. ఎంపీ నిధులతో బోరు వేయించినట్లు తెలిపారు.
- **సీసీ రోడ్డు పనులకు భూమిపూజ**– మాక్లూర్ , మార్చి 14: మదన్‌పల్లి గ్రామం ఒడ్డెర కాలనీలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టనున్న సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులను ఎంపీటీసీ ఒడ్డెన్న గురువారం ప్రారంభించారు. జీపీ కార్యదర్శి మహేశ్, మాజీ ఎంపీటీసీ హన్మాండ్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.
- **రెండో రోజు కొనసాగిన ధర్నా**– ఆర్మూర్‌టౌన్,మార్చి14: మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలో కార్మికులు రెండోరోజు గురువారం ఆందోళన కొనసాగింది. తహసీల్దార్ జగానంద్‌కు విన్నతిపత్రం అందించారు.
- **19న వేలం**– బాల్కొండ, మార్చి 14: బాల్కొండ గ్రామపంచాయతీలో వార సంత, రోజువారి సంత, దాఖల వేలం ఈనెల 19న ప్రత్యేకాధికారి విజయ్ భాస్కర్‌రెడ్డి సమక్షంలో నిర్వహించనున్నట్లు జీపీ కార్యదర్శి రజనీకాంత్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు కార్యదర్శిని సంప్రదించాలని కోరారు.
- **నేడు విద్యుత్ ఫిర్యాదుల పరిష్కార వేదిక**– భీమ్‌గల్, మార్చి 14: పట్టణంలోని సబ్‌స్టేషన్‌లో శుక్రవారం ఉదయం 10:30 నుంచి 1 గంటల వరకు విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో డీఈ హరిచంద్‌నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భీమ్‌గల్, వేల్పూర్ మండలాల వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
- **నర్సరీల పరిశీలన** – భీమ్‌గల్, మార్చి 14: బెజ్జొరా, లింగాపూర్, ముచ్కూర్ గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో కొనసాగుతున్న నర్సరీలను ఎంపీడీవో సంతోష్‌కుమార్ గురువారం పరిశీలించారు. జీపీ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఎంపీవో గంగామోహన్, ఏపీవో నర్సయ్య, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.
- **సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం** – బోధన్/బోధన్ రూరల్, మార్చి 14: మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటును హర్షిస్తూ గురువారం బోధన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చిత్రపటాలకు మున్నూరు కాపులు క్షీరాభిషేకం చేశారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మున్నూరుకాపు సంఘం బోధన్ పట్టణశాఖ, బోధన్ రూరల్ ఉమ్మడి మండలంశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. లింగాయూత్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సందర్భంగా బోధన్, సాలూర మండల లింగాయత్ సమాజ్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.
- **తపస్ ఆధ్వర్యంలో సేవా దివాస్**– రెంజల్, మార్చి 14: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో తపస్ ఆధ్వర్యంలో గురువారం అంబేద్కర్ జయంతి (సేవాదివస్) నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టు బద్రీనాథ్, హెచ్ఎం ఆంజనేయులు, మండల అధ్యక్ష, కార్యదర్శులు బ్రహ్మం, అరుణ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.
- **రెండోసారి వేలం వాయిదా**– నవీపేట (రెంజల్), 14: నవీపేట మండల కేంద్రంలో గురువారం మేకలు, కూరగాయలు, సులబ్ కాంప్లెక్స్‌లకు రెండోసారి వేలం నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర రాకపోవడంతో ఈనెల19కు వాయిదా వేసినట్లు కార్యదర్శి ప్రకటించారు.

కమ్మర్‌పల్లి మండలంలోని హాసాకొత్తూర్‌లో జాతరోత్సవాల్లో భాగంగా వీడీసీ ఆధ్వర్యంలో గురువారం తొలిసేవ తీసినట్లు గ్రామస్తులు తెలిపారు. వీడీసీ అధ్యక్షుడు కొమ్ముల రజనీకాంత్, కార్యదర్శి శ్రావణ్, ఉపాధ్యక్షుడు రాజుల చిన్న బాబయ్య, క్యాషియర్ రాదారపు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.– కమ్మర్‌పల్లి, మార్చి 14

ఘనంగా ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

భీమ్‌గల్‌లో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కమ్మర్‌పల్లి/బాల్కొండ/భీమ్‌గల్/మోర్తాడ్/ఏర్గట్ల, మార్చి 14: మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. కమ్మర్‌పల్లిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. బాల్కొండలో బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. భీమ్‌గల్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నె ప్రేమలతా సురేందర్, జడ్పీటీసీ చౌట్‌పల్లి రవి, కార్యకర్తల నడుమ జన్మదిన వేడుకలు నిర్వహించారు. బడాభీమ్‌గల్ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో గ్రామ శాఖ అధ్యక్షుడు రాగుల మోహన్, బీఆర్ఎస్ నాయకులతో పూజలు నిర్వహించారు. మోర్తాడ్‌లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెడ ఏలియా, ఎంపీపీ శివలింగు శ్రీనివాస్ కేక్‌కట్ చేశారు.శెట్‌పల్లిలో కింగ్స్‌యూత్ ఆధ్వర్యంలో పదో వతరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలను పంపిణీ చేశారు. ఏర్గట్లలో ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు గుల్లె రాజేశ్వర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎనుగందుల రాజాపూర్ణానందం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. వివిధ గ్రామాల పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేల్పూర్‌లో అన్నదానం

వేల్పూర్, మార్చి 14: ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలో సొసైటీ మాజీ చైర్మన్ సామ మహిపాల్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. వేల్పూర్‌లోని వివిధ యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఎమ్మెల్యే కట్‌చేశారు.

కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సరస్వతీ దేవీ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గోపు నారాయణ లావణ్య దంపతుల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు. – కమ్మర్‌పల్లి, మార్చి 14

సరోజనమ్మకు 'విశిష్ట మహిళా పురస్కారం'

బోధన్, మార్చి 14: బోధన్ పట్టణానికి చెందిన సంఘ సేవకురాలు, విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయురాలు గుర్రాల సరోజనమ్మ గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో 'విశిష్ట మహిళా పురస్కారం' అవార్డును అందుకున్నారు. సరోజనమ్మను రాష్ట్ర మంత్రి సీతక్క ఘనంగా సన్మానించి, అవార్డుతోపాటు రూ.లక్ష చెక్కును అందజేశారు. సరోజనమ్మ తన యావదాస్తిని సామాజిక సేవా కార్యక్రమాల కోసం దానం చేసిన విషయం తెలిసిందే. బోధన్‌లోని హిందూ స్మశాన వాటిక వద్ద 'ధర్మస్థలం' పేరిట భవనాన్ని సొంత డబ్బుతో నిర్మించారు.

బోధన్ పట్టణం బీబీ నగర్‌లోని కోట మైసమ్మ సహిత లక్ష్మీ నర్సింహ స్వామి ఆలయ వార్షికోత్సవానికి మల్లూరం లింగేశ్వర ఆలయ వ్యవస్థాపకుడు పిట్ల కృష్ణ మహరాజ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వార్షికోత్సవాలను ఏటా ఘనంగా నిర్వహిస్తున్న పసులేటి గోపికిషన్‌కు మహరాజ్ అభినందించారు. పిట్ల కృష్ణ మహరాజ్‌తోపాటు అయోధ్య నుంచి వచ్చిన సాధువులను ఆలయం తరపున సన్మానించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. – శక్కర్‌నగర్, మార్చి 14

చెక్కుల పంపిణీ

బోధన్, మార్చి 14: బోధన్ పట్టణానికి చెందిన 37 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను గురువారం బోధన్ మ